
# మాతృత్వం

రావినూతల సువర్ణాకన్నన్



"ఇదిగో తపతీ!" అంటూ వచ్చింది పక్కింటి పార్వతమ్మగారు. ఆవిణ్ణి ఆహ్వానించి కూర్చోపెట్టి కాఫీ ఇచ్చి తనూ కూర్చుంది తపతి.

"ఇవాళ ఘన సరసూ వాళ్ళబ్బాయిని ఉయ్యాల్లో వేస్తున్నారట వెళ్తావా?" కాళీ కప్ప పక్కనే పెడుతూ అంది పార్వతమ్మ.

"వెళ్ళకపోతే బావుండదుగా" నవ్వింది తపతి.

"అవున్లే! ... ప్రతివాళ్ళూ నీ చేతుల మీదుగానే జరగాలంటారుగా ఏ శుభకార్యమైనా? అన్నట్టు పిల్లలు స్కూళ్ళకెళ్ళారా?"

"అవును పిన్నిగారూ... వాళ్ళుంటే కిష్కింధాకాండే" అంది తపతి నవ్వుతూ. పార్వతమ్మ కూడా నవ్వుతూ ఏదో అనబోయింది. అప్పుడే సావిత్రి రావడంతో ఆపేసింది.

సావిత్రి తపతి ఫ్రెండు. వాళ్ళ పరిచయం మూడేళ్ళదే అయినా ప్రాణంలో ప్రాణంగా వుంటారు. తపతిని సావిత్రి 'అక్కా' అని పిలుస్తుంది. అసలు తపతి ప్రతివాళ్ళతోనూ మంచిగానే వుంటుంది.

ఆ వూళ్ళో ఏ శుభకార్యం జరిగినా ఆమెను ముందుంచుతారు.

"ఏం జరిగింది సావిత్రీ?" స్నేహితురాల్ని కూర్చోబెట్టి అనునయంగా అడిగింది తపతి, సావిత్రి కళ్ళు ఏడ్చినట్టు ఎర్రగా వుండడం చూసి.

ఆనకట్ట వేద్దామన్నా దుఃఖ సముద్రం ముందుకి వురుకుతానని తొందర చేస్తోంది.

మళ్ళీ అడిగింది తపతి.

"జరగడానికేం వుంటుందీ! కలవారి పిల్ల. అంతకన్నా లక్ష్మీపుత్రుల ఇంట్లోకొచ్చి పడింది. భర్త మంచి పదవిలో వున్నాడు. అల్లరిచేసి ఏపిడించడానికి పిల్లాజెల్లా లేనేలేరాయె. 'పిల్లాజెల్లా లేనేలేరాయె' అన్న పదాన్ని అదోలా ఒత్తిపలుకుతూ అంది పార్వతమ్మ.

సావిత్రి కళ్ళు మరింత ఎర్రబడ్డాయి.

"పిల్లలకేం వుందిలెండి. కుచేల సంతానంలా ఎందర్నయినా కనొచ్చు. వాళ్ళలో ఎంతమంది ప్రయోజకులయ్యారు అన్నది ముఖ్యం" అంది సావిత్రి రోషంగా.

"బావుంది. ఇప్పుడు నేను కానిమాటేం అన్నాననీ! ఎంత సిరిసంపదలుంటే మాత్రం గొడ్రాలిని బిడ్డల తల్లి అనలేం గదా! అయినా ఒకరి గోల నాకెందుకు! వస్తా" అంటూ విసవిస నడిచిపోయింది పార్వతమ్మ.

క్షణం ప్రతిమలా అయిపోయిన తపతి తేరుకుని – "ఏం జరిగిందే?" అంది ఆమె పక్కగా కూర్చుని.

సావిత్రికి మళ్ళీ దుఃఖం వచ్చింది. తపతి భుజం మీదవాలి –

"నేను చచ్చిపోతానక్కా–" అంది.

ఆ ఏడుపు వుధృతం తగ్గేదాకా స్నేహితురాలి వెన్ను నిమురుతూ కూర్చుంది తపతి.

దుఃఖం కాస్త తగ్గాక సరిగ్గా కూర్చుని పైట కొంగుతో మొహం తుడుచుకుని–

"సారీ అక్కా! నా బాధ నీకూ చెప్పి నిన్నూ బాధించాను! క్షమించు" అంది సావిత్రి.

"సరే ఇప్పుడు బాగుచేశావ్‌గా విషయం చెప్పు! ఆ వుండు కాఫీ కలిపి తెస్తాను. ఎంచక్కా కాఫీ తాగుతూ కష్టాలు చెప్పుకుందాం" అని వంటింటికేసి నడిచింది తపతి. సావిత్రీ ఆమెననుసరించింది.

ఇటు పట్నం, అటు పల్లె కానిదావూరు.

అక్కడ ఓ సంస్థలో పనిచేస్తున్నారు మూర్తి, రావులు. మూర్తి భార్య సావిత్రి, రావు భార్య తపతీ అచిరకాలంలోనే ప్రాణ స్నేహితులయ్యారు.

తపతికి ఓ ఆడపిల్ల, ఓ మగపిల్లాడు. మగపిల్లాడు అచ్చం తల్లి పోలిక. ఆడపిల్ల ముమ్మూర్తులా తండ్రి పోలిక. ఇద్దరూ ముద్దుగా వుంటారు.

ఆ వూళ్ళోవాళ్ళంతా మంచివాళ్ళూ కాదు, అంతా చెడ్డవాళ్ళూ కాదు. కానీ వాళ్ళకో చిత్రమైన అలవాటుంది. అదేవిటంటే పిల్లల్లేని వాళ్ళు వాళ్ళ దృష్టిలో ఆడదే కాదు. గొడ్రాలు అన్న ముద్ర వేసి అన్నింటికీ దూరంగా వుంచుతారు. ఆ విషయం ఎంతో బాధిస్తుంది చాలామందిని.

కాఫీ తాగుతూ –

"ఆ ఇప్పుడు చెప్పు, నీ దీన గాథ!" అంది తపతి.

ప్రతిదాన్నీ తేలిగ్గా తీసుకోవడం తపతికి అలవాటు.

క్షణం మౌనంగా వుండిపోయింది సావిత్రి.

రెట్టించింది తపతి.

"ఆ జానకమ్మగారు..." దుఃఖంతో మాట రాలేదు సావిత్రికి.

"చెప్పు! ఆ జానకమ్మగారు?" నుదురు చిట్లించి ఆదుర్దాగా అడిగింది తపతి.

"గొడ్రాలు ఏ శుభకార్యాలకీ రాకూడదట.' అన్నింటికీ నేనున్నానని ముందుకు రాకు' అని మొహమ్మీదే చెప్పిందావిడ" సావిత్రికి మళ్ళీ దుఃఖం వచ్చింది.

## జైన దీపావళి

జైనమత స్థాపకుడు వర్ధమాన మహావీరుడు దీపావళి పర్వదినాన నిర్యాణం పొందాడని, అందుకని ఆ రోజు ఆయనను పూజించి దీపాలు వెలిగించారని జైన గ్రంథాలు తెలుపుతున్నాయి. ఆ ప్రకారమే దీపావళి పండుగ ఆచరణలోకి వచ్చిందని జైనుల విశ్వాసం!

–శర్మ. పిహెచ్

"గొడ్రాలు... అంటే పిల్లల్లేని వాళ్ళు శుభకార్యాలలో పాల్గొకూడదా? ఇది నేనెక్కడా విన్లేదే! భర్త లేని స్త్రీ శుభకార్యాలలో పాల్గొకూడదని మాత్రమే విన్నాను. ఇదేదో కొత్తగా వింటున్నాను" ఏదో ఆలోచిస్తూ అంది తపతి.

"కానీ ఆమె అంది" రోషంగా అంది సావిత్రి.

తపతి హాయిగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావ్?"

"చెప్తాను. ముందు కాఫీ తాగు."

మౌనంగా కాఫీ తాగి కప్పు కింద పెట్టింది సావిత్రి.

"ఇప్పుడు చెప్పు! జానకమ్మగారేమంది?" అడిగింది తపతి. మళ్ళీ చెప్పింది సావిత్రి.

"కొందరంతే సావిత్రీ! ఎదుటివాళ్ళు బాధపడుతుంటే ఆనందించడం వాళ్ళకో ఆనందం."

"మరి నువ్వెందుకు నవ్వావ్? నేను గొడ్రాలిననేగా!"

"ఛ!ఛ! నా మనసు తెలిసి ఎలా అనగలిగావా మాట?... నీ కళ్ళకి నేనంత హీనంగా కనిపిస్తున్నానా?" బాధగా అంది తపతి. తనన్న తీరుకి తపతి బాధపడిందని గ్రహించిన సావిత్రి –

"సారీ అక్కా! ఆవిడ అలా అనేసరికి..."

"నువ్వు బాధపడి, ఏడ్చి... ఇలా మాట్లాడావ్. అంతేనా? పిచ్చి సావిత్రీ! పిల్లల్లేకపోవడం దురదృష్టమే. కానీ అది పాపం కాదు. అయినా నీ కెన్నేళ్ళని సంతానం కలగదని బాధపడ్డానికి? అందులో నీలోగానీ, మీ ఆయనలోగానీ ఎలాంటి లోపం లేదని చెప్పారు డాక్టర్లు. కాబట్టి మైడియర్ సావిత్రీ! పుట్టబోయే పాపాయి కోసం ఎదురు చూస్తూ హాయిగా వుండు" సావిత్రి ముక్కు పట్టి లాగుతూ అంది తపతి.

సావిత్రి మొహం వెలిగిపోయింది.

"అక్కా, నాకు నిజంగా పిల్లలు... పుడతారంటావా?" అంది ఆనందం, అనుమానం కలిసిన గొంతుతో.

"తప్పకుండా పుడతారు. నేను చెప్తున్నాను నా మాట పొల్లుపోదు"


స్త్రీల టానిక్

లోధ్ర

బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
90 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.

స్త్రీలకు కలుగు అకాల బహిష్టు,
ముట్టుకుట్టు, బుతురక్తం
ఎక్కువ తక్కువగా పోవుట, నడుము నొప్పి,
సంతానహీనత, గర్భకాలపు జబ్బులకు

ఉచిత వైద్య సలహా కొరకై
ఈ ప్రక్క చిరునామాతో
సంప్రదించండి



తయారుచేయువారు:
కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు – 600 014.

ఏజంట్లు : సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్,
విజయవాడ – 1 – సికిందరాబాద్

"థాంక్స్ అక్కా" ఆమెని చుట్టేసి ఉత్సాహంగా తిప్పేసింది సావిత్రి.

* *

సాయంత్రం సరసూవాళ్ళిల్లు సందడిగా వుంది.

"తొందరగా కానీయండర్రా! అవతల సూర్యాస్తమయం అవబోతోంది. సూర్యాస్తమయం అయ్యాక బాబుని ఉయ్యాలలో పడుకోపెట్టరాదు" ఓ వృద్ధురాలు హెచ్చరించింది.

"ఇదిగో ఈసారి వాయినం ఎవరికిస్తారు?" ఓ ఇల్లాలంది.

"ఇంకెవరికిస్తాం మన సావిత్రుందిగా... ఆమెకే ఇద్దాం. ఆవిడకాక ఇక్కడ సంతానం లేనివారెవరూ లేరు." అంది మరో ఇల్లాలు.

బాలింతరాలి దగ్గర్నించి వాయనం తీసుకుంటే ఏడాది తిరక్కుండా సంతానం కలుగుతుందని వారి నమ్మకం. సావిత్రి లేచింది తప్పనిసరిగ్గా. ఆమె నంటినట్టు నిల్చుంది తపతి.

కొంత తతంగం పూర్తయింది.

"ఇక తొందరగా పిల్లాణ్ణి వుయ్యాల్లో పడుకోబెట్టండి... ఆ... ఇంతకీ ఎవరు పడుకోబెడతారు?" గుసగుసగా అంది పేరంటాలు.

"ఇంకెవరు మన తపతే! ఈవిడ దాదాపు పది మంది పిల్లల్ని వుయ్యాల్లో వేసింది. అంతా సలక్షణంగా వున్నారు. ఆవిడ చెయ్యి చాలా మంచిది"

చాలామందలా అనడంతో తప్పనిసరిగా లేచి బాబుని బాలింతరాలితో కలిసి వుయ్యాల కింది నుంచి తిప్పి అందుకుని తర్వాత వుయ్యాల్లో పడుకోబెట్టింది తపతి. తర్వాత కూడా చాలా మంది తపతి హస్తవాసి గురించి చెప్పుకున్నారు. బిడ్డల్లేని వారిని గొడ్రాళ్ళుగా చెప్పి హీనంగా మాట్లాడారు.

హడావిడంతా అయింది. పసుపూ, బొట్టూ తీసుకున్నారంతా. ముందుగా లేచింది తపతి.

"అదేవిటి వాయనం తీసుకోకుండానే లేచావ్?" అంది సరసూవాళ్ళమ్మ.

"ఏంలేదు. ఈ శుభసందర్భంలో నేనో చిన్నమాట చెప్పాలని..." నవ్వుతూ అంది తపతి.

"చెప్ప చెప్ప" ఉత్సాహంగా అన్నారంతా.

"నా హస్తవాసి మంచిదే కదూ?"

"అన్నన్నా!... సాక్షాత్తూ ఆ పార్వతీదేవి హస్తమే నీ హస్తం."

"అయితే జాగ్రత్తగా వినండి... నాకూ పిల్లల్లేరు.. అంటే మీ లెక్క ప్రకారం నేనూ గొడ్రాలిని."

"వ్వాట్?" పిడుగుపడ్డట్టు చూశారంతా.

"అవును. నేనూ అక్కా కవలపిల్లలం. ఇద్దరం ఒకేలా వుండేవాళ్ళం. అక్క పెళ్ళయి, ఆమెకీ కవలలు వుట్టారు. ఒకరు అమ్మ పోలిక. ఒకరు నాన్న పోలిక. అదే మా పిల్లలు. మా బావ... అదే ప్రస్తుతం మావారు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నారు. పిల్లల కోసం నేను మా బావని చేసుకున్నా ఈ రహస్యం మా పిల్లలక్కూడా తెలియనీయలేదు.

సావిత్రికి పిల్లలు పుడతారన్న నమ్మకం వుంది. కానీ నాకు లేదు. గొడ్రాలినైన నా చేత ఎన్నో శుభకార్యాలు చేయించారు. అందరూ హాయిగా వున్నారు. అది వారి అదృష్టమే తప్ప నా చేతి మహిమ కాదు. మీరనుకున్నట్టు గొడ్రాలు చేసినవన్నీ తారుమారవాలిగా.

మరో సంగతి! మొన్న రంగమ్మగారి మనవడికి అక్షరాభ్యాసం, వూరికి పెద్ద ముత్తయిదువయిన, పది మంది సంతానాన్ని కన్న శాంతమ్మగారి చేత చేయించారు. ఏమయింది? ఆ మర్నాడే ఆ పిల్లాడు చెర్లోపడి చచ్చిపోయాడు. దానికి కారణం శాంతమ్మగారా? కాదు.

నేను ఎవర్నీ కించపరచాలని కాదు ఈ మాటలు మాట్లాడింది. గీతలో రాసినట్టు మనమంతా నిమిత్తమాత్రులం. మన చేతిలో ఏం లేదు. గొడ్రాలనీ, విధవ అనీ పేరు పెట్టి వారిని కించపరచకండి. రేపేం జరుగుతుందో తెలియని మనం ఇలా మాట్లాడడం కేవలం తెలివిహీనత వల్లే. క్షమించండి. నా మాటలు మిమ్మల్ని నొప్పిస్తే" రెండు చేతులూ జోడించి అడుగు వేస్తున్న తపతిని ఆపింది శాంతమ్మ.

"ఏవిటి బామ్మగారు! నా మాటలు మిమ్మల్ని నొప్పించాయా? క్షమించండి" అంది తపతి.

వృద్ధురాలు చల్లగా నవ్వింది.

"లేదమ్మా నువ్వన్నదే నిజం. ఈ వూరు మొత్తంలో వయసులో నేనూ, మావారే పెద్దలం. మా మాట ఎవరూ కాదనరు. నేను చెప్తున్నాను. ఇంకనించీ గొడ్రాలనీ, విధవ అనీ ఎవర్నీ కించపరచమని నీకు మాట ఇస్తున్నాను" కాస్త ఉద్వేగంగా అంది వృద్ధురాలు.

దానికి అందరూ ఆమోదించారు ఏకగ్రీవంగా. సావిత్రిని క్షమార్పణ కోరారు కూడా.

పొంగిపోయింది సావిత్రి. తపతి చేతులు రెండూ కళ్ళకద్దుకుంది.

ఎప్పటిలా ఆమె తియ్యగా నవ్వింది.

* * *

రెండేళ్ళ తర్వాత సావిత్రికి బాబు పుట్టాడు. ఫంక్షన్ బ్రహ్మాండంగా అరేంజ్ చేశారు సావిత్రి దంపతులు.

తపతి హంగామా సరేసరి.

ఆ సాయంత్రం అంతా చేరి వుయ్యాల దగ్గరికొచ్చారు. తపతి బాబుని గుండెలకి హత్తుకుని వుయ్యాల్లో పడుకోబెట్టపోయింది.

"అక్కా" అంది సావిత్రి కంగారుగా.

"ఏవిటి?" అన్నట్టు చూసింది తపతి.

"బాబుని..."

"ఉయ్యాల్లో పడుకోబెడుతున్నాను" అమాయకంగా అంది తపతి.

"బాబుని మా అమ్మమ్మ పడుకోపెడుతుంది. ఎంతైనా నీకు పిల్లల్లేరుగా... అహ్... అమ్మ... అంటుంటే..." తడబడుతూ చెప్పింది సావిత్రి.

ప్రతిమలా అయిపోయింది తపతి. ఎన్నడూ ఎవరి మీదా రానంత అసహ్యం కలిగింది సావిత్రి మీద.

"అంటే నేను గొడ్రాలిననా?" అంది తీక్షణంగా.

"అంతేగా మరి... నా కభ్యంతరం లేదనుకో..."

"సావిత్రీ! చాలా థాంక్స్. నీలాంటి వాళ్ళు నా స్నేహితులని చెప్పకోవడానికి సిగ్గుపడుతున్నాను.

ఇప్పడసలు విషయం చెప్తాను విను. నాకు అక్కల్లేరు, చెల్లెళ్ళు లేరు. నేనొక్కదాన్నే మా తల్లిదండ్రులకు సంతానాన్ని. ఆ రోజు నీ బాధని చూడలేక లేని కళంకాన్ని ఆపాదించుకున్నాను. నీ కోసం నేను పిల్లలేనిదాన్నని చెప్పకున్నాను.

ఇప్పడు నీ స్వభావం తెలిసింది. చూడూ ఈ పిల్లలిద్దరూ నా బిడ్డలే. అంటే నేను నవమాసాలూ మోసి కన్నబిడ్డలే... అనుమానం వస్తే ఆ మూల కూర్చున్నారే డాక్టర్ జ్యోతి. ఆవిడే నా రెండు పురుళ్ళూ పోశారు. ఆవిణ్ణడుగు.

నీలాంటిది స్నేహితురాలని చెప్పకోవడానికి సిగ్గుపడుతున్నాను. ఛ!" అంటూ పిల్లలిద్దర్నీ పట్టుకుని, వెనకనించి సావిత్రి పిల్చినా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది. అయోమయంగా అనుసరించాడామె భర్త.

సావిత్రి దంపతులు ప్రతిమల్లా చూస్తుండగానే కారు కదిలిపోయింది.



ప్రేమికుడు (కాదలన్) చిత్రంతో తమిళ్ చిత్ర రంగంలో ప్రవేశించిన అందాల సుందరి నగ్మా సూపర్‌స్టార్ రజనీకాంత్ సొంత చిత్రం 'పాచ్చా'లో హీరోయిన్‌గా నటిస్తోంది. తన ఒంపు సొంపులతో తమిళ ప్రేక్షకులను ఆకట్టుకొని అక్కడే సెటిల్ అయ్యే ఆలోచనలో వుందని వార్తలు వస్తున్నాయి. 'నగ్మా' ఈ మధ్య మద్రాసులో ఓ ఫ్లాట్ కూడా కొన్నది.

— మనోజ